
Toli Velugu 24.01.26_Layout 1 1/24/2026 9:13 AM Page 1


# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 16 | పేజీలు : 5 | శనివారం 24 జనవరి 2026 | వెల : 2/-

మంచిమాట

పదునైన ఆయుధం కంటే
క్షణ కాలంలో వచ్చే కోపమే
అత్యంత ప్రమాదకరం

~ రామకృష్ణ పరమహంస

# ఫోన్ ట్యాపింగ్ కేసు..
# 7 గంటల పాటు కేటీఆర్ విచారణ

- వాంగ్మూలం రికార్డు చేసిన సిట్ అధికారులు
- సుదీర్ఘంగా కొనసాగిన విచారణ
- విచారణ అనంతరం తెలంగాణ భవన్ చేరుకున్న కేటీఆర్



నిత్యం నిఘా, డెస్క్, జనవరి 23 : ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మొదటి రోజు విచారణ ముగిసింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు సుమారు 7 గంటల పాటు ఆయనను విచారించి వాంగ్మూలం రికార్డు చేశారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఈ విచారణ కొనసాగింది. విచారణ అనంతరం కేటీఆర్ జూబ్లీహిల్స్ పీఎస్ నుంచి తెలంగాణ భవన్ చేరుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎస్ఐబీ కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటూ 2024 మార్చిలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసును ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలోని సిట్ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగానే తాజాగా కేటీఆర్‌ను సిట్ విచారించింది.

## కార్తీకదీపం సరే.. ముందు బీఆర్ఎస్ దీపం ఆరిపోకుండా చూసుకోండి - మహేశ్ గౌడ్

- కేటీఆర్ వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ ఫైర్
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని వ్యాఖ్య
- కవితను చెల్లెలుగా గౌరవిస్తానన్న పీసీసీ చీఫ్



నిత్యం నిఘా, డెస్క్, జనవరి 23 : ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న విమర్శలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. ఈరోజు మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన... వ్యక్తిగత హననం జరుగుతోందని కేటీఆర్ అనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ పరిధిలోనే విచారణ సాగుతోందని స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణి ఉంటే అధికారంలోకి రాగానే చర్యలు ఉండేవని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్ ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఇద్దరి మధ్య సంభాషణ వినడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కుటుంబం అలీబాబా-420 దొంగల మాదిరిగా దోపిడీకి పాల్పడిందని మహేశ్ గౌడ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ స్టువర్ట్‌పురం దొంగల బ్యాచ్‌లా మారిందన్నారు. ఆరనీకుమా ఈ కార్తీకదీపం అనే ముందు, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ దీపం ఆరిపోకుండా చూసుకోవాలని సెటైర్లు వేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై కేటీఆర్ మాట్లాడటం పూర్తిగా హాస్యాస్పదమన్నారు. తోడబుట్టిన చెల్లెలు కవిత ఫోన్ ట్యాప్ చేశారని గగ్గోలు పెడుతుంటే ఇప్పటివరకు సరైన సమాధానం చెప్పలేదని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు చాలా తీవ్రమైనదని, దీనిని ఉద్యమ కేసులతో పోల్చడం సరికాదని స్పష్టం చేశారు. అధికారులకు కూడా పరిమితులు ఉంటాయని అన్నారు.


## మేడారంలో కూలిన భారీ హోర్డింగ్

- జంపన్న వాగు నుంచి గద్దెలకు వెళ్లే మార్గంలో ఘటన
- భక్తులు ఎక్కువగా లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం
- ఒకరికి స్వల్ప గాయాలు.. ఆసుపత్రిలో చికిత్స



నిత్యం నిఘా, డెస్క్, జనవరి 23 : మేడారంలో పెను ప్రమాదం తప్పింది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. జాతర ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో హరిత హోటల్ సమీపంలోని వై-జంక్షన్ వద్ద భారీ హోర్డింగ్ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. జంపన్న వాగు నుంచి గద్దెల వైపు వెళ్లే మార్గంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో ఒక భక్తుడికి స్వల్ప గాయాలు కాగా, వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో భక్తుల రద్దీ తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. లైటింగ్ నేమ్ బోర్డు హోర్డింగ్ కూలిపోవడానికి గల కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. జాతరకు దాదాపు నెల రోజుల ముందు నుంచే లక్షలాది మంది భక్తులు మేడారం ేరుకుని, మొక్కులు చెల్లించుకుంటున్నారు.

## జనగామలో మంత్రి సీతక్క పర్యటనలో ఉద్రిక్తత



నిత్యం నిఘా, డెస్క్, జనవరి 23 : తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క జనగామ పర్యటనలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. జనగామ జిల్లా కేంద్రంలో అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి సీతక్క, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అనుచరుల మధ్య మాటల యుద్ధం జరిగింది. పెంబర్తి క్రాస్ వద్ద చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ప్రోటోకాల్ ప్రకారం సీతక్క, పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని కాదని, ఈ ప్రాంత అభివృద్ధి కార్యక్రమాల్లో ఇతర నియోజకవర్గాలకు చెందిన వారికి ప్రాధాన్యత ఇచ్చారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. మరోవైపు, కొబ్బరికాయ కొట్టేందుకు బీఆర్ఎస్ నాయకులను ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి ఆహ్వానించగా, ఇది బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమం కాదని కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం తెలిపారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతల మధ్య వాగ్వాదం, తోపులాటకు దారితీసింది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 'గో బ్యాక్' అంటూ నినాదాలు చేయగా, బీఆర్ఎస్ శ్రేణులు 'జై పల్లా' అంటూ ప్రతి నినాదాలు చేశారు.

## సిరిసిల్ల కేంద్రంగా కేటీఆర్ అక్రమంగా ఫోన్లు ట్యాపింగ్ చేయించారు - బండి సంజయ్



- సిట్ విచారణ సీరియల్‌లా సాగుతోందని ఎద్దేవా
- సిట్ విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకాలాడుతోందని ఆగ్రహం
- కేసీఆర్ దారుణాలతో కొన్ని కుటుంబాలు నిండా మునిగాయని విమర్శ
- కేసీఆర్ కుటుంబాన్ని అరెస్టు చేసే ధైర్యం లేదని వ్యాఖ్య

నిత్యం నిఘా, డెస్క్, జనవరి 23 : సిరిసిల్లను కేంద్రంగా చేసుకొని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అక్రమం గా ఫోన్లను ట్యాపింగ్ చేయించారని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపిం చారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ సీరియల్ మాదిరి గా సాగుతోందని ఎద్దేవా చేశారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిట్ విచారణ పేరుతో కాంగ్రెస్..

2

## మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం రూ.3.70 కోట్లు విడుదల

- నిధులు విడుదల చేసిన పర్యాటక మంత్రిత్వ శాఖ, గిరిజన మంత్రిత్వ శాఖలు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవతో నిధులు విడుదల
- గతంలో రూ.80 కోట్లతో పర్యాటకులకు మౌలిక సదుపాయాలు



నిత్యం నిఘా, డెస్క్, జనవరి 23 : మేడారం జాతర నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం శుభవార్తను వెల్లడించింది. సమ్మక్క, సారలమ్మ జాతర నిర్వహణ కోసం నిధులను విడుదల చేసింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, గిరిజన మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా రూ. 3.70 కోట్లను విడుదల చేశాయి. కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ కిషన్ రెడ్డి చొరవతో ఈ నిధులు విడుదలయ్యాయి. మేడారం పరిసర ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు గిరిజన సర్క్యూట్ పేరుతో గతంలో రూ. 80 కోట్లతో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించింది. అంతేకాకుండా రామప్ప దేవాలయం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 140 కోట్లు ఖర్చు చేస్తోంది.

Toli Velugu 24.01.26_Layout 1 1/24/2026 9:13 AM Page 2



# గ్రీన్ గ్రోవ్ స్కూల్‌లో అక్షర సంబరం

- శాస్త్రోక్తంగా సరస్వతీ పూజలు
- జ్ఞాన సంపదే అసలైన నిధి: డైరెక్టర్ లక్ష్మీ
- చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన చైర్‌పర్సన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి

చౌటుప్పల్, జనవరి 23 (తొలివెలుగు): చౌటుప్పల్ పట్టణంలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో వసంత పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మాఘ శుక్ల పంచమిని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో సరస్వతీ దేవి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్‌పర్సన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి చిన్నారులకు శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ ఎస్. లక్ష్మీ మాట్లాడుతూ.. జ్ఞాన సంపదే అసలైన నిధి అని, విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వసంత పంచమి ప్రత్యేకతను ప్రతిబింబించేలా పసుపు రంగు దుస్తుల్లో విద్యార్థులు హాజరుకావడంతో పాఠశాల ప్రాంగణం వసంత శోభను సంతరించుకుంది. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం




విద్యార్థుల్లో విద్య పట్ల ప్రేమను, భారతీయ సంస్కృతి పట్ల గౌరవాన్ని, ఆధ్యాత్మిక భావనను




పెంపొందించేలా నిర్వహించబడిందని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

# ట్రినిటీ విద్యాసంస్థల్లో ఘనంగా అక్షరాభ్యాసం

- 286 మంది చిన్నారులకు అక్షర శ్రీకారం
- భక్తిశ్రద్ధలతో వసంత పంచమి వేడుకలు
- మున్సిపల్ చాంబర్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు హాజరు
- ట్రినిటీ విద్యాసంస్థల డైరెక్టర్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల

చౌటుప్పల్, జనవరి 23 (తొలివెలుగు): విద్యకు ఆరాధ్యదైవమైన సరస్వతీ దేవి జన్మదినం 'వసంత పంచమి'ని పురస్కరించుకుని స్థానిక ట్రినిటీ విద్యాసంస్థల్లో అక్షరాభ్యాస మహోత్సవం కన్నులపండువగా జరిగింది. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 286 మంది చిన్నారులు తమ విద్యాప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. ప్రముఖ అర్చకులు కిషోర్ శర్మ పర్యవేక్షణలో వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు జరిగాయి. తొలుత విఘ్నేశ్వరునికి, నవగ్రహాలకు పూజలు నిర్వహించిన అనంతరం, సరస్వతీ దేవిని శ్వేత



పుష్పాలు, వీణ, కమలంతో అత్యంత సుందరంగా అలంకరించి ప్రత్యేక హారతులు సమర్పించారు. అనంతరం తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారుల చేత ఓంకార నాదంతో అక్షరాలు దిద్దించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చాంబర్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు మాట్లాడుతూ.. బాల్యదశలోనే పిల్లలకు అక్షర జ్ఞానంతో పాటు సంస్కారవంతమైన విద్యను అందించడం అభినందనీయమన్నారు. గాంధీ గ్లోబల్ ట్రస్ట్ మండల అధ్యక్షురాలు వెన్ రెడ్డి





సంధ్య, విద్యాసంస్థల చైర్మన్ కే.వి.బి. కృష్ణారావు, డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ.. విద్యార్థులు సరస్వతీ దేవి దీవెనలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అక్షరాభ్యాసం చేసుకున్న చిన్నారులకు పాఠశాల యాజమాన్యం తరపున పలకలు, బలపాలు, ప్రసాదాన్ని అందజేశారు. భారతీయ సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సమన్వయకర్తలు మాలిక్, శివరాణి, శ్రీవాణి మంజుల, స్వప్న, నీరజ, జ్యోతి, ప్రీతి, లక్ష్మీ ప్రియ, లవ కుమారి, చందన, సుమలత, స్వరూప భార్గవిలతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది, అధిక సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# సిరిసిల్ల కేంద్రంగా కేటీఆర్ అక్రమంగా ఫోన్లు ట్యాపింగ్ చేయించారు

## - బండి సంజయ్

మొదటి పేజీ తరువాయి..
ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ చేసిన దారుణాల వల్ల కొన్ని కుటుంబాలు నిండా మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి అరెస్టులు జరగవని అన్నారు. అవినీతి, అక్రమ కేసుల్లో కేసీఆర్ కుటుంబాన్ని అరెస్టు చేసే ధైర్యం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. దేశ భద్రత కోసం కూడా ఫోన్ ట్యాపింగ్ జరుగుతుంటుందని, దానికి తెలంగాణలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి ఏమాత్రం సంబంధం లేదని అన్నారు. మావోయిస్టుల పేరుతో హీరోయిన్లు, వ్యాపారులు, రాజకీయ నేతలు, జడ్జిల ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో మంచి అధికారులు ఉన్నారని పేర్కొన్నారు. కానీ వారికి ఈ ప్రభుత్వంలో స్వేచ్ఛగా విచారణ జరిపే అవకాశం లేకుండా పోయిందని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఒక్క రాజకీయ నాయకుడినైనా అరెస్టు చేశారా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉండి ఉంటే కేసీఆర్ కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకునే వాళ్లమని అన్నారు. తప్పు చేసిన నేతలు, అధికారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



# ఆగదు కాలం.. ఆపకు పయనం

- ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- నేటి లక్ష్యం రేపటి మీ జీవితం



వలిగొండ, జనవరి 23 (తొలివెలుగు) : ఓ అడుగు ముందుకు వేసిన తర్వాత దాన్ని వెనక్కి తీసుకోవచ్చు. కానీ సమయం అలా కాదు. గడిచిన కాలం తిరిగి రాదు. రాబోయే రెండు నెలల్లో ఇంటర్ అనంతరం పది, డిగ్రీ తదితర పరీక్షలు జరగనున్న నేపథ్యంలో, ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరీక్షల ప్రకటనలు కూడా వెలువడే అవకాశముంది. ఈ తరుణంలో విద్యార్థులు విలువైన సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై (తొలివెలుగు) ప్రత్యేక కథనం.

డబ్బుకన్నా సమయం విలువైనది. గడిచిన రోజు రద్దు చేసిన చెక్కు లాంటిది. చేతిలో ఉన్న డబ్బును ఎలా వినియోగించుకుంటామో, అలాగే సమయాన్ని కూడా ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకోవాలి. ముఖ్యంగా చదువు, నిద్రకు సరిపడా సమయం కేటాయించాలి. సమయానికి విలువ ఇచ్చినప్పుడే విజయ తీరాలకు చేరుకోవచ్చు.

### కబుర్లతో కాలక్షేపం..

కళాశాలలకు వెళ్లే కొందరు విద్యార్థులు పాఠ్యాంశాలంటే విసుగు అంటూ తరగతి గదులను వదిలి బయటకు వస్తున్నారు. బేకరీలు, చరవాణులతో సమయం గడుపుతూ కబుర్లలో కాలాన్ని వృథా చేస్తున్నారు. కబుర్లకు గుడ్‌బై చెబితేనే బంగారు భవిష్యత్తు సొంతమవుతుంది.

### చరవాణి అవసరానికి మాత్రమే

చరవాణిని వినియోగానికి తగిన సమయానికి, పరిమితంగా వాడాలి. అదే పనిగా చాటింగ్ చేస్తే చదువుపై శ్రద్ధ తగ్గుతుందనే విషయాన్ని గుర్తించాలి. అంతర్జాలం కేవలం వినోదానికి మాత్రమే కాదు, అపారమైన విజ్ఞానాన్ని అందించే వేదిక కూడా. రోజువారీ పనులను అదే రోజున పూర్తి చేయాలి. వాయిదా వేయకూడదు. చదువుతో పాటు నిద్రకు తగిన సమయం కేటాయిస్తూ, ఆరోగ్య సూత్రాలను పాటించాలి. ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదవడం ద్వారా మేధస్సును పెంపొందించుకోవాలి. సరదాలకు కాలాన్ని వృథా చేయకుండా, మంచి మిత్రులతో స్నేహం చేస్తే విజ్ఞానం లభిస్తుంది.



### లక్ష్యం తెలుసుకోవాలి

ప్రతి విద్యార్థికి స్పష్టమైన లక్ష్యం ఉండాలి. లక్ష్యం లేకుంటే జీవితం అంధకారమవుతుంది. పది, ఇంటర్ స్థాయికి వచ్చినా ఇంకా జీవిత లక్ష్యం నిర్ణయించుకోలేకపోవడం కనిపిస్తోంది. మరికొందరు తమ సామర్థ్యానికి మించిన లక్ష్యాలు పెట్టుకుని ఒత్తిడికి గురవుతున్నారు. అర్హత, ఆసక్తి, అనుకూలతలను పరిగణలోకి తీసుకుని లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. ఆ లక్ష్య సాధనకు ప్రణాళిక అవసరం. అంటే కాలాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందే.

### ఎవరికైనా 24 గంటలే..

రోజుకు ఎవరికైనా ఇరవై నాలుగు గంటల సమయమే ఉంటుంది. సమయానికి పేద - ధనిక అనే తేడా ఉండదు. ఒకే తరగతి గదిలో కొందరు విజేతలుగా నిలుస్తుంటే, మరికొందరు వెనుకబడిపోతుంటారు. దానికి కారణం చదువుపై దృష్టిపెట్టడం, ప్రణాళికాబద్ధంగా అధ్యయనం చేయడంలో ఉన్న వ్యత్యాసమే.



మాధవి, ప్రధానోపాధ్యాయురాలు
జడ్పీహెచ్ఎస్ పులిగిల్ల

# వర్కట్‌పల్లిలో కాంగ్రెస్ గ్రామశాఖ నూతన కమిటీ ఎన్నిక

- ఏకగ్రీవంగా నాయకుల ఎంపిక



వలిగొండ, జనవరి 23 (తొలివెలుగు): వర్కట్‌పల్లి గ్రామంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగింది. నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా బంధారపు సంతోష్ గౌడ్‌ను ఎన్నుకోగా, ఉపాధ్యక్షుడిగా మీసాల శంకరయ్యను ఎంపిక చేశారు. కోశాధికారిగా గూడూరు రాఘవరెడ్డిని నియమించారు. ప్రధాన కార్యదర్శిగా మీసాల శంకరయ్య, కార్యదర్శులుగా మాడుగుల రమేష్, మీసాల స్వామి, కీనేరా యాదేయ్యలను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా గుర్రం అంజయ్య, నాగేల్లి పాండు గౌడ్, బంగారి ప్రసాద్‌ను నియమించారు. సమాచార కమిటీ బాధ్యతలను కానుగు కృష్ణ, కందుకూరి రాజు, మీసాల వెంకటేష్‌కు అప్పగించారు. గౌరవ సలహాదారులుగా బీమిడి లింగా రెడ్డి, సజయ్ కుమార్, పబ్బు రవీందర్ గౌడ్‌లను ఎంపిక చేశారు. ఎన్నికైన నూతన కమిటీ పత్రాలను వలిగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తి రెడ్డికి సమర్పించారు. కార్యక్రమంలో గిరి బాబు, బంగారి మహిపాల్, యాదేయ్య, అనంతచారి, నర్సింహా, రవి, వంశీ, ప్రసాద్, బుచ్చేయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు





- జనసేన ఆధ్వర్యంలో నేతాజీకి ఘన నివాళులు
- మున్సిపల్ ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేస్తాం : మేకల సతీష్ రెడ్డి
- మండల పార్టీ అధ్యక్షుడు పర్నె శివారెడ్డి

చౌటుప్పల్, జనవరి 23 (తొలివెలుగు) : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా జనసేన అధ్యక్షుడు మేకల సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మేకల సతీష్ రెడ్డి మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్యం అహింసతో మాత్రమే కాకుండా సాయుధ పోరాటాల ద్వారానే సాధ్యమైందని అన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి సుభాష్ చంద్రబోస్ దేశ స్వాతంత్ర్య సాధన కోసం పోరాడిన తీరును గుర్తు చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా జనసేన పార్టీ స్వతంత్రంగా పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. 2014లో తెలంగాణలో ఆవిర్భవించిన జనసేన పార్టీ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తోందని, పార్టీ విస్తరణలో భాగంగా గ్రామస్థాయి వరకు సంస్థను బలోపేతం చేస్తామని తెలిపారు. గత గ్రామపంచాయతీ ఎన్నికల్లో 150 స్థానాల్లో పోటీ చేసి 50 స్థానాల్లో విజయం సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో జనసేన పార్టీ పోటీకి సిద్ధమైందని, చౌటుప్పల్ మున్సిపాలిటీలో అన్ని స్థానాల్లో జనసేన అభ్యర్థులు బరిలోకి దిగనున్నారని చెప్పారు. అభ్యర్థుల జాబితాను త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. ఇతర పార్టీలకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గ్లాస్ గుర్తుపై జనసేన అభ్యర్థులు పోటీ చేసి, తెలంగాణలో ఊహించినదానికంటే ఎక్కువ స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పర్నె శివారెడ్డి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు

- ❖ గోగినేని కృష్ణ తేజ ఆధ్వర్యంలో నిర్వహణ
- ❖ ముఖ్య అతిథిగా బడుగు లక్ష్మయ్య హాజరు





చౌటుప్పల్, జనవరి 23 (తొలివెలుగు): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ 43వ జన్మదిన వేడుకలను చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గోగినేని కృష్ణ తేజ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా మునుగోడు నియోజకవర్గ మాజీ ఇంచార్జ్, మండల పార్టీ అధ్యక్షుడు బడుగు లక్ష్మయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో టపాకాయలు పేల్చి, స్వీట్లు పంపిణీ చేస్తూ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజలకు సేవ చేసే భాగ్యం కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్ల పార్వతలు యాదవ్, వర్కల వెంకటేష్, మారగోని అశోక్ గౌడ్, సిలివేరు రాజు, చెవిగోని రమేష్, యట వెంకటేష్, బొంగు బదుసా, చెరుకు అశోక్, బోదుల గణేష్, వాళ్లేటి రామకృష్ణ, పృథ్వి, శరత్, నర్సింహా పాల్గొన్నారు.

# రెండో రోజుకు చేరిన నేతన్నల రిలే నిరాహార దీక్ష

- చేనేత రుణమాఫీ, సమస్యల పరిష్కారం కోరుతూ భారీ పాల్గొనింపు

వలిగొండ, జనవరి 23 (తొలి వెలుగు): వలిగొండ మండల కేంద్రంలో పద్మశాలి సంఘం, మార్కండేయ సంఘాల ఆధ్వర్యంలో చేనేత రుణమాఫీతో పాటు చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరాయి. ఈ దీక్షలకు వలిగొండ మండల వ్యాప్తంగా చేనేత కార్మికులు, పద్మశాలీలు భారీ సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు. ఈ రిలే నిరాహార దీక్షలకు రాష్ట్ర కార్మిక సంఘ అధ్యక్షుడు వనం శాంతి కుమార్, జిల్లా కార్మిక సంఘ అధ్యక్షుడు గుర్రం నరసింహ, ప్రధాన కార్యదర్శి గుండు వెంకట నర్సి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పల్లెల రామచంద్ర, టీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపిటిసి పల్సం రమేష్, అప్రోచ్ పార్టీ నాయకులు పబ్బు స్వామి, పోలేపాక సత్యనారాయణ తదితరులు సంఘీభావం తెలియజేశారు. రెండో రోజు జరిగిన దీక్షలో పద్మశాలి పట్టణ సంఘ గౌరవ అధ్యక్షుడు సాయి యాదగిరి, పద్మశాలి సంఘ అధ్యక్షుడు గంజి వెంకటేశ్వర్లు, కార్మిక సంఘ అధ్యక్షుడు జిల్లా నరేందర్, మార్కండేయ అసోసియేషన్ అధ్యక్షుడు మిర్యాల భాస్కర్, సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి



గర్దాసు నరసింహ, వలిగొండ పట్టణానికి చెందిన చేనేత కార్మికులు దొంత శంకరయ్య, నామాల జగన్మోహన్, పెండే విగ్నేష్, గుంటి రవీందర్, గంజి బాల నరసింహ, జిల్లా నరహరి, ఐటీ పాముల మీనయ్య, ఎలగందుల లెనిన్, వంగరి రమేష్, మిర్యాల వెంకటేశం, కూరపాటి భూమయ్య, చిందం సత్తయ్య, గంజి వెంకటేశం, పాపని రాజు, వేన ఆంజనేయులు, గర్దాస్ ఆంజనేయులు, గుంటి రమేష్, చిందం యాదగిరి, పారుపల్లి నరసింహ, రచ్చ వెంకటేశం, ఎక్కలాదేవి శ్రీనివాస్, బోడో కుమార్, కర్నాటి వెంకటేశం, ముదుదొడ్ల శేఖర్, రచ్చ సంతోష్, గంజి ఉపేందర్, పారుపల్లి వెంకటేశం, గంజి చంద్రయ్య, సుంకి విక్రమ్, వెలువర్తి మిశ్రమ చేనేత సహకార సంఘానికి చెందిన వేముల భాస్కర్, నామాల ఉప్పలయ్య, కొండ లక్ష్మయ్య, ఎక్కలదీవి సిద్ధయ్య, రవ్వ శ్రీరంగం, చిందం వెంకటేశం, మహేశ్వరం ఇస్తారి తదితర చేనేత కార్మికులు కూడా ఈ రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నేతన్నులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో గ్రామ సర్పంచ్

**- వసంత పంచమి సందర్భంగా చిన్నారులకు పలకల పంపిణీ**





సంస్థాన్ నారాయణపురం, జనవరి 23 (తొలివెలుగు) : సర్వేల్ సెక్టార్ ప్రాజెక్టు రామన్నపేట ఆధ్వర్యంలో సర్వేల్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలు 1, 2, 3తో పాటు ఎర్రగుంట, మర్రిగూడెం ప్రాంతాల్లో వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలకరాజు చందన రాజు పాల్గొని పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చులతో 50 పలకలను అందజేశారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం చిన్నారుల్లో విద్య పట్ల ఆసక్తిని పెంపొందిస్తూ, సంప్రదాయాలకు అనుగుణంగా అక్షరాభ్యాసాన్ని ప్రోత్సహించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు సభ్యుడు బోయ చందు, 9వ వార్డు సభ్యుడు సిలివేరు సువర్ణ గాలయ్య, 10వ వార్డు సభ్యుడు వీరమల్ల నర్సింహ, 12వ వార్డు సభ్యుడు రమాదేవి నరసింహ, గ్రామ కార్యదర్శి చంద్రశేఖర్, అంగన్వాడి ఉపాధ్యాయులు ఈ. దేవిక, కె. సత్తమ్మ, కె. శైలజ, వి. శోభ, ఈ. భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం ముత్యాలు, అండాలు, ఆశ వర్కర్లు సుగుణమ్మ, సరిత, కవిత, మాజీ సర్పంచ్ మానుపాటి సతీష్ కుమార్, గ్రామ పెద్దలు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**❖ సహాయం అందజేసిన బొబ్బిళ్ళ మురళి**



చౌటుప్పల్, జనవరి 23 (తొలివెలుగు): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ 12వ వార్డుకు చెందిన సిరికొండ రాములమ్మ మృతి పట్ల కాంగ్రెస్ నాయకులు బొబ్బిళ్ళ మురళి సంతాపం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆమె గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న మురళి.. బాధితురాలి నివాసానికి వెళ్లి ఆమె భర్త నరసింహను పరామర్శించారు. అనంతరం వారికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు కంచరకుంట్ల శశిధర్ రెడ్డి, అన్నారం బాలయ్య, మాజీ వార్డు సభ్యుడు మలిగే యాదయ్య, మొగుదాల మల్లేష్ గౌడ్, బోయ మంకులు, మలిగే నరసింహ, మల్లేష్, బాతరాజు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చౌటుప్పల్, జనవరి 23 (తొలివెలుగు): మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. చౌటుప్పల్ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకుడు అర్ధ వెంకట్ రెడ్డి గ్రామ నాయకులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా గూడూరు లావణ్య రెడ్డికి రూ.60,000 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు అర్ధ జనార్దన్ రెడ్డి, వార్డు సభ్యులు సుర్కంటి స్వాతి శ్రీనివాసరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బొడ్డు జయంతి జంగయ్య, పక్కీరు ఎల్లారెడ్డి, రాచకొండ మల్లేష్, ముత్యాల జంగారెడ్డి, అర్ధ కమలమ్మ, సింగిరెడ్డి సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

**నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పణ**





చౌటుప్పల్, జనవరి 23 (తొలివెలుగు) : భారత స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి సందర్భంగా దండు మల్కాపూర్ గ్రామంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు దేప శ్యాంసుందర్ ముదిరాజ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం ఆవరణలో ఉన్న నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా దేప శ్యాంసుందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. "జననం తెలిసినప్పటికీ మరణం తెలియని వీరుడు నేతాజీ. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించి 'నాకు రక్తం ఇవ్వండి, మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను' అనే నినాదంతో దేశమంతా జాతీయ భావాన్ని రగిల్చారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి ఆంగ్లేయుల గుండెల్లో వణుకు పుట్టించారు. భారతమాత ముద్దుబిడ్డగా దేశానికి చేసిన సేవలను ఎన్నటికీ మరువలేం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతాజీ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ముదిగొండ మహేష్, ఉపాధ్యక్షుడు రాచర్ల ఈశ్వర్, గ్రామ ఉపసర్పంచ్ మీసాల నరసింహ, మాజీ అధ్యక్షులు ఈడ్దుల ఐలయ్య యాదవ్, మునుకుంట్ల నర్సింహ గౌడ్, ఈడ్దుల హరిప్రసాద్, పబ్బు శ్రీనివాస్ గౌడ్, మొగిలి మహేందర్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శులు ఈడ్దుల మస్తాన్ బాబు యాదవ్, నెల్లికంటి హరిప్రసాద్, వార్డు సభ్యుడు ఈడ్దుల ఇంద్రసేన యాదవ్, బాడీ సభ్యులు కంచర్ల మధుసూదన్ రెడ్డి, దౌడి రాజేష్, కలగోని వెంకటేష్, ఈడ్దుల నరేష్, బాతరాజు శివకృష్ణ, సంఘ సీనియర్ సభ్యులు పటేల్ వెంకటరెడ్డి, గోపానబోయి నాగేష్, దౌడి పెద్ద యాదగిరి, గుండ్ల అశోక్, ఈడ్దుల బాబు యాదవ్, సిల్వేరు వెంకటేష్, సుక్క కృష్ణ, దౌడి వెంకటేష్, ఈడ్దుల కేశవ్, ఎల్లంకి సురేష్, నెల్లికంటి గురుప్రసాద్, ఈడ్దుల పరమేష్, ఈడ్దుల గణేష్, నెల్లికంటి శ్రీకాంత్, ఒంటెద్దు రాజు, బుర్ర శివకుమార్ గౌడ్, దౌడి లింగస్వామి, గుండ్ల లింగస్వామి, చందుపట్ల సాయి నేత, బుర్ర విజయ్ గౌడ్, పక్కిరు ప్రభాకర్ రెడ్డి, ఈడ్దుల రాజేష్, బుర్ర శ్రీకాంత్, ఈడ్దుల సాయి కిరణ్, సిల్వేరు సాయి, సందగళ్ళ నవిన్, కంచర్ల నవీన్ రెడ్డి, ముదిగొండ నరేష్, తిరుమలేష్, దేప అరుణ్, బాలు తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం పోటీ

**- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు: బూరుగు కృష్ణారెడ్డి**



చౌటుప్పల్, జనవరి 23 (తొలివెలుగు): చౌటుప్పల్ మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థులు బరిలోకి దిగుతున్నారని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి తెలిపారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్న అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో పార్టీ మున్సిపల్ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు నరసింహ అధ్యక్షతన పార్టీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో కలిసి వచ్చే శక్తులతో సమన్వయం చేసుకుని సిపిఎం అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీగా ఏర్పడిన నాటి నుంచే పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తున్న సిపిఎం అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజా సమస్యలపై పోరాడే అభ్యర్థులను గెలిపించాలని, డబ్బు, మద్యం ద్వారా ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నించే వారికి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు గోశిక కరుణాకర్, ఎండి పాషా, అవ్వారి రామేశ్వరి, కార్యవర్గ సభ్యులు దండా అరుణ్ కుమార్, బత్తుల దాసు, ఉస్కా గులా శ్రీనివాస్, ఆకుల ధర్మయ్య, గోపగోని లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వార్థ రాజకీయాలకు చరమగీతం పాడాలి

- **13వ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి సిద్ధం**
- **అవకాశం ఇస్తే సమగ్ర అభివృద్ధి చేస్తాం**
- **చెరుకు స్వాతి శివకుమార్ గౌడ్**



చౌటుప్పల్, జనవరి 23 (తొలివెలుగు): చౌటుప్పల్ మున్సిపాలిటీ 13వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు చెరుకు స్వాతి శివకుమార్ గౌడ్ వెల్లడించారు. శుక్రవారం చౌటుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బీసీ మహిళా రిజర్వేషన్ కేటాయించిన ఈ వార్డులో ప్రజలు తనను ఆశీర్వదిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేసే వారికే ఓటర్లు పట్టం కట్టాలని కోరారు. అనంతరం మునుగోడు నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రముఖ న్యాయవాది చెరుకు శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల వేళ మద్యం, నగదుకు లొంగకుండా వివేకంతో ఓటు వేయాలని పిలుపునిచ్చారు. నిధులను దుర్వినియోగం చేస్తూ, స్వప్రయోజనాల కోసం పార్టీలు మారే నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. స్వార్థ రాజకీయాలకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు.

Toli Velugu 24.01.26_Layout 1 1/24/2026 9:13 AM Page 5



## నకిలీ నోట్ల కేసులో పదో నిందితుడిపై పీడీ యాక్ట్ నమోదు



కామారెడ్డి జిల్లా, జనవరి 23 (తొలివెలుగు) : కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన నకిలీ నోట్ల కేసులో ఇప్పటివరకు మొత్తం 14 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. వీరిలో ఇప్పటికే 9 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేయగా, తాజాగా మరో నిందితుడిపై కూడా పీడీ యాక్ట్ నమోదు చేశారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఏఎస్పీ చైతన్య రెడ్డి పర్యవేక్షణలో ఈ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పదో నిందితుడు చత్రం ఆదిత్యపై పీడీ యాక్ట్ వర్తింపజేస్తూ, గురువారం కామారెడ్డి పట్టణ ఇన్స్పెక్టర్ నరహరి మరియు కామారెడ్డి జిల్లా పీడీ సెల్ ఇన్‌చార్జ్ నర్సింలు నిజామాబాద్ జైలులో పీడీ యాక్ట్ కాపీలను అందజేశారు. నకిలీ నోట్ల తయారీ, చలామణీ వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. ఇటువంటి నేరాలను అరికట్టేందుకు జిల్లా పోలీసులు నిరంతర నిఘా కొనసాగిస్తామని తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్ మీటింగ్

**- ఉత్తమ ఫలితాలే లక్ష్యమని ప్రిన్సిపల్ పావని కుమారి**



జనగామ జిల్లా, జనవరి 23 (తొలివెలుగు) : తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ శ్రీ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు జనగామ జిల్లా ధర్మకంచలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ నాముని పావని కుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజా ప్రభుత్వం మరియు ఇంటర్మీడియట్ బోర్డు విద్యార్థుల కోసం ఉచిత విద్య, అడ్మిషన్లు, పాఠ్యపుస్తకాలు, ఆధునిక తరగతి గదులు, డిజిటల్ క్లాస్‌రూమ్స్, అన్ని సౌకర్యాలతో కూడిన సైన్స్ ల్యాబ్స్, ఆన్‌లైన్ అటెండెన్స్ విధానం, తల్లిదండ్రులకు ఎస్ఎంఎస్‌ల ద్వారా సమాచారం, విద్యార్థులకు చదువుతో పాటు ఆట స్థలాలు, ఆట సామగ్రి, యోగా మరియు మానసిక వికాస తరగతులు, స్టూడెంట్ కౌన్సిలర్ల సేవలు వంటి అనేక సదుపాయాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సౌకర్యాలను విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు సమర్థవంతంగా ఉపయోగించుకుని రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల స్టాఫ్ సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ లెక్చరర్ వేముల శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పస్కుల శ్రీనివాస్, మరిపెల్ల రవి ప్రసాద్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గ్రామ బొడ్రాయి దేవతకు ఘనంగా బోనాల సమర్పణ



వరంగల్ జిల్లా (తొలివెలుగు) : జనతా పరమ సంఘం కాలనీవాసులు గ్రామ బొడ్రాయి దేవతకు భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆదర్శ కాలనీ నుంచి మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ నృత్యాలు, డప్పుల నాదాలతో బోనాల ఊరేగింపుగా బయలుదేరి బొడ్రాయి తల్లికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప్పునూతల స్వరూప శివకుమార్, మహంకాళి బుడిమే రాజు రాజా, మానస రవితేజ, మండల రాధికఉరాంబాబు, తార రాములు, బల్బదాస్ రాజశేఖర్, నవిత, కొంగోండి కుమార్ రాజా, నకిర్త తిరుపతి రాజేశ్వరి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల వేడుకలు భక్తి పరవశంతో, పండుగ వాతావరణంలో కన్నుల పండుగగా జరిగాయి. గ్రామ ప్రజలంతా ఐక్యంగా పాల్గొని బొడ్రాయి దేవత కృపకు పాత్రులయ్యారు.

# ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే సిట్ విచారణలు : ఉప్పు కృష్ణ



చౌటుప్పల్, జనవరి 23 (తొలివెలుగు): సిట్ విచారణల పేరుతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పు కృష్ణ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెలలో ఒకసారి కాలేశ్వరం విచారణలు, ఫోన్ టాపింగ్ కేసులు అంటూ నోటీసులు, విచారణల పేరుతో కాలయాపన చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లిస్తోందని ఆరోపించారు. అధికారంలోకి రాకముందు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా, కేసులుఉనోటీసుల పేరుతో అధికారంలో ఉన్న పెద్దలు తమ సీట్లను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా హామీలు నెరవేర్చకపోగా, ప్రతిపక్ష పార్టీల నాయకులపై కక్ష సాధింపు చర్యలుగా కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే కష్టాల ప్రభుత్వం, కమిషన్ల ప్రభుత్వం అన్నట్లుగా పరిపాలన కొనసాగుతోందని విమర్శించారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాలు, అమరవీరుల కుటుంబాలకు ఉద్యోగాలు, ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఏవైనా అవినీతి, అక్రమాలు జరిగి ఉంటే విచారణ సంస్థలు స్వతంత్రంగా విచారణ చేయాల్సి ఉంటుందని, కానీ ప్రభుత్వ పెద్దలు అధికారులపై ఒత్తిడి తెచ్చి నోటీసులు ఇప్పించడం, విచారణలకు పిలవడం సరైంది కాదని అన్నారు. ప్రభుత్వ పెద్దలు విచారణ అధికారుల్లా మాట్లాడుతున్న తీరును తెలంగాణ సమాజం గమనిస్తోందని తెలిపారు. ఐటీ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌కు తరలి వెళ్లే విధంగా, నీళ్లు కూడా ఆంధ్రకు తరలిపోయే విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ కార్యాచరణ ఉందని విమర్శించారు. తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ భావజాలం, తెలంగాణ ఉద్యమకారులపై హేళన చేసే విధంగానే రాష్ట్రంలో పరిపాలన కొనసాగుతోందని, దీనిని ఎంత మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. గత పంచాయతీ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే దీనికి నిదర్శనమని, రాబోయే మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటిసి ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కక్ష సాధింపు చర్యలను పక్కనపెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ విషయంలో ప్రభుత్వం రెండేళ్ల గ్యాప్ ఇచ్చిందని గుర్తు చేశారు. రైతుబంధు నిలిపివేయడంతో పాటు నాణ్యమైన కరెంటు ఇవ్వడంలో విఫలమైందని, విద్యుత్ కోతలతో రాష్ట్రం చీకట్లలోకి వెళ్లుతోందని ఆరోపించారు. ఎన్నికలు, ఓట్లు, సీట్లే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పట్టణ మహిళలకు ఇందిరమ్మ చీరలు, వడ్డీ లేని రుణాలు ఇవ్వడం ఏ విషయానికి సంకేతమని ప్రశ్నించారు. నిన్న హరీష్ రావు, నేడు కేటీఆర్, రేపు కేసీఆర్ అంటూ వరుసగా విచారణ నోటీసులు ఇవ్వడం తప్ప ప్రభుత్వానికి సాధించేదేమీ లేదని వ్యాఖ్యానించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి చీకటి రాజకీయాలను తెలంగాణ ప్రజలు, తెలంగాణ సమాజం, తెలంగాణ ఉద్యమకారులు గమనిస్తున్నారని, వాటిని ఎంత మాత్రం సహించబోరని స్పష్టం చేశారు.

## డ్రగ్స్ రహిత సమాజం కోసం సమన్వయ చర్యలు

**- మాదకద్రవ్యాలపై కఠిన నియంత్రణకు కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశాలు**



మహబూబాబాద్ జిల్లా, జనవరి 23 (తొలివెలుగు) : మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎన్ఐసి సమావేశ మందిరంలో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి కిరణ్ కుమార్, జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సరిత, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మదార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్, మాదకద్రవ్యాల నియంత్రణకు పక్కా కార్యాచరణ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌డీపీఎస్ కేసుల నమోదు, గంజాయి సాగు నివారణ చర్యలు, మత్తు పదార్థాల రవాణా-వాడకం అరికట్టేందుకు శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక నష్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

మాదకద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి వారికి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అటవీశాఖ అధికారులు తమ పరిధిలోని అటవీ భూములను నిరంతరం పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపుల్లో డ్రగ్స్ స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని సూచించారు.

అన్ని విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో మాదకద్రవ్యాల నిరోధక ప్రచారం విస్తృతంగా నిర్వహించాలని, సంస్కృతిక సారథి సభ్యులు, సోషల్ మీడియా, ప్రింట్-ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. ఇంటెలిజెన్స్ విభాగం ఆర్టీసీ బస్సులు, రైళ్లు తదితర ప్రాంతాల్లో నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ నిఘా పెంచాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ చిరంజీవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీను, కలెక్టరేట్ సూపరింటెంట్ రాజేష్, డాక్టర్ శ్రావణ్‌తో పాటు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.